# ప్రజా మార్పు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 242 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 29 - 03 - 2026




ఏప్రిల్ 25న కొత్త పార్టీ పేరు ప్రకటించనున్న కవిత

# మెట్రో విస్తరణకు ప్రభుత్వ నిర్ణయం

- హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనంపై సభలో రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
- ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడి
- ప్రజాప్రయోజనాల దృష్ట్యా మెట్రో విస్తరణకు నిర్ణయం తీసుకున్నామన్న ముఖ్యమంత్రి
- మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను సమీక్షించామన్న సీఎం రేవంత్ రెడ్డి
- మెట్రో ఫేజ్-2బీ 86.1 కి.మీ మేర నిర్మాణం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడి



**హైదరాబాద్ :**

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ ముఖ్య మంత్రి హైదరాబాద్ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఎల్ అండ్ టీ నుం చి మెట్రోను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలి పారు మెట్రో విస్తరణకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్వా ధీన ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా మెట్రో విస్తర ణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు.మెట్రో - మిగతా 2 లో

## మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ ఓంకారేశ్వర ఆలయ శంకుస్థాపన



- రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం..శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి
- మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం
- 8 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన
- మూసీ నది మధ్యలో 100 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటు.. పర్యాటక సౌకర్యాల కల్పన



## కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉంటుందన్న బండి సంజయ్
- కేసీఆర్ తప్పుడు నిర్ణయాల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని విమర్శ
- రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష సమాజం తలదించుకునేలా ఉందని మండిపాటు

## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

- బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ దాటినట్లు వెల్లడి
- అంతర్జాతీయ జలాల్లోకి రెండు నౌకలు ప్రవేశించాయన్న భారత వర్గాలు
- 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ రాక



**ఢిల్లీ :**

భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శక్రవారం నాడు దుబాయ్ రస్‌ఆల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే.ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరికొన్ని భారతీయ ట్యాంకర్లు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి - మిగతా 2 లో

## ప్రపంచంలోని ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై యుద్ధం ప్రభావం పడిందన్న ప్రధాని
- ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని వెల్లడి
- ఇంతటి సంక్షోభం సమయంలోనూ అభివృద్ధి కొనసాగుతోందని ఉద్ఘాటన



**ఢిల్లీ :**

పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత - మిగతా 2 లో

## ప్రజానాడి




## "టెంట్ వేసుకునైనా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేద్దాం"

- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- అసెంబ్లీలో అమరావతి తీర్మానం వేళ పవన్ కల్యాణ్ భావోద్వేగ ప్రసంగం
- రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం గొప్ప విషయమని వ్యాఖ్య



**అమరావతి :**

రాష్ట్ర విభజన జరిగిన కొత్తలో చంద్రబాబును కలిసినప్పుడు, "టెంట్ వేసుకునైనా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేద్దాం" అని ఆయన అన్న మాటలు తనను ఎంతగానో - మిగతా 2 లో

## అమరావతి చట్టబద్ధతను స్వాగతిస్తూనే ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించిన షర్మిల

- రాజధాని నిర్మాణానికి లక్ష కోట్లు ఎక్కడి నుంచి వస్తాయని షర్మిల ప్రశ్న
- హక్కుగా రావాల్సిన నిధుల కోసం అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయడంలేదన్న షర్మిల
- నిధులు అడగకుండా చట్టబద్ధత పేరుతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శ



**అమరావతి :**

అమరావతిని చట్టబద్ధ రాజధానిగా గుర్తించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని రాష్ట్ర వైసీపీ చీఫ్ షర్మిల స్వాగతించారు. ఇదే సమయంలో కేంద్రం నుంచి రావాల్సిన - మిగతా 2 లో

# అమరావతే నవ్యాంధ్ర రాజధాని

## ఇక అమరావతిని అంగుళం కూడా కదిలించలేరు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం
- గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేసిందని చంద్రబాబు విమర్శ
- 2028 నాటికి రాజధానిలోని కీలక నిర్మాణాలు పూర్తి చేస్తామని వెల్లడి
- అమరావతిలో విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఒకే రాజధాని, మూడు ప్రాంతాల అభివృద్ధి తమ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతేనని, దీనిని ఎవరూ తాకలేరని, అంగుళం కూడా కదిలించలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో, శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిపై గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని, ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యాలను సుదీర్ఘంగా వివరించారు.

**చారిత్రక నేపథ్యం.. తెలుగుజాతి ఆత్మగౌరవం**

అమరావతికి వందల ఏళ్ల చరిత్ర ఉందని, శాతవాహనులు ఇక్కడి నుంచే పాలన సాగించారని చంద్రబాబు గుర్తు చేశారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం అమరావతి గ్యాలరీ ఉండటమే దీని ప్రాశస్త్యానికి నిదర్శనమని అన్నారు. - మిగతా 2 లో

## అసెంబ్లీలో ముక్తకంఠంతో చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలు

- అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రాష్ట్ర శాసనసభ తీర్మానం
- శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబు
- రాజధాని అమరావతి చట్టబద్ధతపై అభిప్రాయాలను సభలో తెలిపిన బీజేపీ, జనసేన ప్రజాప్రతినిధులు
- రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తీర్మానం చేసేందుకు రాష్ట్ర శాసనసభ ప్రత్యేకంగా సమావేశం
- అనంతరం అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై సభలో చర్చ కొనసాగింది
- "ఒక ప్రాంతం కోసం కాదు. రాష్ట్ర ప్రజలందరి కోసం రాజధాని నిర్మాణం - మంత్రి నాదెండ్ల మనోహర్
- అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని జనసేన నిర్ణయం




**అమరావతి :**

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తీర్మానం చేసేందుకు రాష్ట్ర శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. ఉదయం సభ ప్రారంభం కాగానే తీర్మానాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారు. విభజన చట్టంలోని సెక్షన్ 5లోని సబ్‌సెక్షన్ 2లో 'ఎట్ అమరావతి (అమరావతిలో)' అన్న పదాన్ని చేర్చాలని తీర్మానించారు. సెక్షన్ 5కి సంబంధించి విభజన చట్టంలో ఇచ్చిన వివరణలో 'ఏపీ సీఆర్‌డీఏ చట్టం-2014 ప్రకారం నోటిఫై చేసిన కేపిటల్ సిటీ ప్రాంతాలతో సహా అమరావతి' అని చేర్చాలని ముఖ్యమంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై సభలో చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా అమరావతికి - మిగతా 2 లో

# సంపాదకీయం

## సంక్షోభ సమయం



పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగానే ఉండబోతున్నదనీ, అది దీర్ఘకాలం కొనసాగుతుందనీ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సంకేతాలు సహజంగానే అందరినీ కలవరపెడతాయి. ఆయన సోమవారం లోక్‌సభలో, మంగళవారం రాజ్యసభలో చేసిన ప్రసంగాల్లో ఆరేళ్ల క్రితం కోవిడ్ రోజుల నాటి పరిస్థితులతో వర్తమాన స్థితిని పోల్చారంటే దేశం ముున్ముందు ఎలాంటి సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి 23 రోజుల క్రితం ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం ట్రంప్ తాత్కాలిక విరామం ప్రకటన తర్వాత ఆగిన సంకేతాలు కనబడినా, యుద్ధ విరమణ ఉండబోదన్న ఇజ్రాయెల్ తీరు చూస్తే అందరిలోనూ సందేహాలు కలుగుతున్నాయి. అంతేకాదు... అటు ఇరాన్ సైతం అమెరికాతో చర్చించలేదని చెబుతోంది. చివరకు అదేమవుతుందన్న సంగతలా ఉంచితే, ఇప్పటికే ప్రపంచంతోపాటు మనమూ సంక్షోభంలో చిక్కుకుపోయామని తెలుస్తూనే ఉంది. క్షణక్షణం మాట మార్చే ట్రంప్‌ను ఇరాన్‌తోపాటు ప్రపంచ ప్రజానీకం కూడా పెద్దగా విశ్వసించలేదుగానీ... స్టాక్ మార్కెట్లు మాత్రం నమ్మదల్చుకున్నట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి. మార్కెట్లన్నీ మంగళవారం ఉత్సాహంతో ఉరకలెత్తాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారిగా 10 శాతం పడిపోయాయి. కానీ ఈ ధోరణి దీర్ఘకాలం కొనసాగటం అనుమానమే.యుద్ధంపై కేంద్రం నుంచి వెలువడిన ఈ తొలి ప్రకటన సాధారణ జనంలో కొద్ది రోజులుగా ఉన్న భయాందోళనలు నిర్హేతుకం కాదని సూచిస్తోంది. ఆర్థిక, జాతీయ భద్రతా రంగాలతోపాటు మానవతారంగంలోనూ పెను సవాళ్లను ఎదుర్కొనబోతున్నామని ప్రధాని చెబుతున్నారు. మన ఆర్థిక ప్రగతికి ప్రధానంగా తోడ్పడే చమురు, సహజవాయువుల్లో సింహభాగం పశ్చిమాసియా నుంచే రావాలి. ఆ ప్రాంతం మామూలు స్థితికి చేరేదాకా ఆ రెండు దిగుమతులపైనా అనిశ్చితి కొనసాగుతుంది. గల్ఫ్ దేశాల్లో భిన్న వృత్తి ఉద్యోగాల్లో ఉన్న కోటిమంది భారతీయుల్లో 3 లక్షల మంది ఇప్పటికే వెనక్కొచ్చారు. ఇరాన్ ప్రతిదాడుల వల్ల గల్ఫ్ దేశాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. చమురు, గ్యాస్ ఎగుమతులు నిలిచిపోవటం వల్ల అవి గడ్డు పరిస్థితుల్లో పడ్డాయి. జనం ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకీడుస్తున్నారు. తమ గ్యాస్ ఉత్పాదక క్షేత్రాన్ని చక్కదిద్దటానికి చాలా ఏళ్లు పట్టవచ్చని ఖతార్ అంటున్నది. కనుక గల్ఫ్‌లో ఉపాధి కల్పన మళ్లీ పట్టాలెక్కడం అంత సులభం కాదు.గల్ఫ్ సంక్షోభంతో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన స్థాయిలో ఎరువులు అందుతాయా అన్న సందేహాలున్నాయి. సాగుకు లోటురానీయబోమని మోదీ హామీ ఇవ్వడం అందుకే. ఆయన చెబుతున్న ప్రకారం కొన్ని శక్తులు ఈ సంక్షోభాన్ని స్వప్రయోజనాలకు వినియోగించుకునే ప్రయత్నం చేస్తాయి. అది ఆంతరంగిక భద్రతపై ప్రభావం చూపుతుంది. దేశం ఐక్యంగా ఉండి ఈ సంక్షోభాన్ని అధిగమించాలని ఆయన పిలుపునిచ్చారు.సాధారణ సమయాల్లో పెద్దగా చర్చకు రాని విదేశాంగ విధానం సంక్షోభ కాలంలో ముందుకొస్తుంది. మనది మోదీ వ్యక్తిగత విధానంగా మారిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. తమ కాలంలో ఎప్పుడూ ఇలా లేదని కూడా చెబుతున్నారు. కానీ నాటి ద్విధ్రువ ప్రపంచం ఏకధ్రువ ప్రపంచంగా మారింది. అప్పుడు అలీన విధానం అని చెప్పుకున్నామేగానీ సోవియెట్‌కు సన్నిహితంగా మెలిగాం. అప్పట్లో అమెరికాపై దూకుడు ప్రదర్శించటం అందులో భాగమే.నిజంగా తటస్థంగా ఉన్నట్టయితే హంగేరీ (1956), జెకొస్లోవేకియా(1968), అఫ్గాన్(1979)లపై సోవియెట్ దురాక్రమణకు దిగినప్పుడు ఖండించి ఉండేవాళ్లం. మారిన పరిస్థితుల్లో భిన్న దేశాలపై వేర్వేరు అంశాల్లో ఆధారపడి ఉన్నామన్నది కాదనలేని సత్యం. నిజానికి అన్ని దేశాల పరిస్థితీ అదే. చైనా, రష్యాలు ఇరాన్‌కు గట్టి మద్దతుదార్లుగా నిలిచినా ఆపత్సమయంలో అవి తటస్థంగానే ఉండిపోక తప్పలేదు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేయటాన్ని చూపి, కనీసం రష్యా ఇరాన్‌కు నిఘా సమాచారాన్ని ఇచ్చింది. పరిస్థితులు ముున్ముందు మరింత సంక్లిష్టంగా మారినా మారొచ్చు. ఈలోగా మన రాజ్యాంగ విలువలను ప్రతిబింబించే మెరుగైన విదేశాంగ విధానం రూపుదిద్దుకుంటే మంచిది.

## ప్రపంచంలోని ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

**మొదటిపేజీ తరువాయి –** ఏర్పడిందని అన్నారు.ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు, ప్రజలపై ఈ యుద్ధం భారం పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంతటి సంక్షోభ సమయంలో మన దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రశాంతతను పాటించాలని ప్రధాని మోదీ కోరారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు.నోయిడాలోని జేవార్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. రూ.11,200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఆధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సహాయంతో 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయం రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

**మొదటిపేజీ తరువాయి –** చూస్తున్నాయి. కాగా, 47,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో కూడిన జగ్ వసంత్ ట్యాంకర్ నౌక గుజరాత్‌లోని వదినార్ పోర్టుకు చేరుకుంది.

## మెట్రో విస్తరణకు ప్రభుత్వ నిర్ణయం



**మొదటిపేజీ తరువాయి –** విస్తరణకు ఉన్న అడ్డంకులను సమీక్షించినట్లు సభకు తెలిపారు. ప్రజారవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచి, ఈ నగరానికి అంతర్జాతీ యస్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చేందుకు కావలసిన ప్రణాళికలను రచించామని అన్నారు. అనంతరం అసెంబ్లీలో మెట్రో స్వాధీనంపై తీర్మానం ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం: హరీశ్ రావు**

మెట్రో స్వాధీనంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఇది ఏకగ్రీవ తీర్మానం కాదని, ఏకపక్ష తీర్మానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యుల అభిప్రాయం తీసుకోకుండా ఏకగ్రీవంగా బిల్లును ఎలా ఆమోదింపజేస్తారని ప్రశ్నించారు. ప్రకటన చేసే హక్కు ఉంది కానీ, చర్చ లేకుండా సభ్యులంతా ఆమోదించినట్లు ధన్యవాదాలు చెప్పడం సరికాదని అన్నారు.

# అమరావతే నవ్యాంధ్ర రాజధాని

**మొదటిపేజీ తరువాయి –** చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై బీజేపీ, జనసేన ప్రజాప్రతినిధులు వారి అభిప్రాయాలను సభలో తెలిపారు. 'అమరావతే నవ్యాంధ్ర రాజధాని. అమరావతి రాజధానిగా ఉంటేనే రాష్ట్ర ప్రజలందరికీ న్యాయం జరుగుతుంది' అని మంత్రులు, ఎమ్మెల్యేల ముక్తకంఠంతో చెప్పారు.మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, "ఒక ప్రాంతం కోసం కాదు. రాష్ట్ర ప్రజలందరి కోసం రాజధాని నిర్మాణం జరుగుతుంది. వైఎస్సార్సీపీ చేసిన 3 రాజధానుల కుట్రను జనసేన తరపున వ్యతిరేకించాం. రైతులకు కౌలు ఇవ్వకుండా వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఇబ్బంది పెట్టింది. పవన్‌కల్యాణ్ రాజధానికి వస్తే ముళ్లకంచెలు వేసి అడ్డుకున్నారు. రైతులను పరామర్శించకుండా అపి ఇబ్బంది పెట్టారు. అమరావతి రాష్ట్ర ప్రజల మనోభావాలకు సంబంధించిన విషయం. రాష్ట్ర విభజనతో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు రైతులు అండగా నిలిచారు. జగన్, వైఎస్సార్సీపీ నేతలు చేసిన అరాచకం ప్రజలందరికీ తెలియజేయాలి. రాజ్యాంగ ప్రక్రియ, అసెంబ్లీ విధానాలు పాటించకుండా వైఎస్సార్సీపీ వ్యవహరించింది" అని విమర్శించారు.

**ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయం :** "అభివృద్ధి విషయంలో రాజకీయ కోణంతో ఆలోచించి వైఎస్సార్సీపీ ఇబ్బంది పెట్టింది. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని జనసేన నిర్ణయం తీసుకుంది. పవన్‌కల్యాణ్ కూడా ఇదే విషయాన్ని అన్నిచోట్లా స్పష్టంగా చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయం జరిగింది. సభ అభిప్రాయం తెలుసుకోకుండా కేంద్రం నిర్ణయం తీసుకోవటంతో రాష్ట్రానికి నష్టం జరిగింది. రాష్ట్ర విభజన బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాం. మొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఏపీని విడగొట్టవద్దని చెప్పాం. చట్టంలో ఉన్న విధివిధానాలను కూడా పట్టించుకోకుండా చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి మంచి రాజధాని ఉండాలని చంద్రబాబు భావించారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా వచ్చి అమరావతిని ఆశీర్వదించారు. ఏకైక రాజధాని అమరావతి కోసం జనసేన తీవ్రంగా ప్రయత్నించింది. కూటమి విజయం తర్వాత మన బాధ్యత మరింతగా పెరిగింది. అమరావతి తీర్మానం సాంకేతిక అంశం కాదు మనోభావాలకు సంబంధించింది" అని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

**2019లో రాష్ట్రంలో వైఎస్సార్సీపీ వైరస్ :** మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, " 2019లో ఒక వైరస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అనంతరం ఆ వైరస్ విధ్వంసం సృష్టించింది. ఐదేళ్లలో 50 ఏళ్ల విధ్వంసం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో అభివృద్ధి అటకెక్కింది. ప్రజల మధ్య వైషమ్యాలను వైఎస్సార్సీపీ రెచ్చగొట్టింది. ప్రస్తుతం అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేసేలా పరిపాలిస్తున్నాం. పవన్‌కల్యాణ్ నటించిన ఒక సినిమాలో అబద్ధాలు మాట్లాడితే ఆకులు రాలుతాయి అనే డైలాగ్ ఉంది. ఒకవేళ జగన్ కూడా నల్లమలకు వెళ్లి మాట్లాడితే అక్కడి చెట్లన్నీ మోడుబారిపోతాయి" అని సత్యకుమార్ విమర్శించారు.

**రాజధాని విషయంలో చిక్కులు ఉండవు :** ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, "రాష్ట్ర విభజనను చాలామంది వ్యతిరేకించారు. రాజధాని విషయంలో శివరామకృష్ణన్ కమిటీ సూచనలు చేసింది. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో అమరావతిని చేర్చాం. అమరావతి రాజధాని విషయంలో చిక్కులు ఉండవని సూచిస్తున్నా. అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని గట్టిగా నమ్ముతున్నా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అమరావతి కేంద్రంగా మారనుందని విశ్వసిస్తున్నా" అని సుజనాచౌదరి స్పష్టం చేశారు.

**ప్రజల అభిమానాన్ని చూరగొన్న వ్యక్తులు చంద్రబాబు, పవన్ :** బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, "అమరావతి ప్రస్తావనలో భూములు ఇచ్చిన రైతులను తలచుకోవాలి. 2019–24 మధ్య రాష్ట్రంలో రాక్షస పరిపాలన జరిగింది. శ్రీలంకలో రావణాసురుడి పాలనలోనూ అంత దుర్మార్గం జరిగి ఉండదు. కేంద్ర సహకారంతో అమరావతిని చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పునర్నిర్మిస్తోంది. రాష్ట్రంలో అభివృద్ధిని వికేంద్రీకరించి పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకొస్తున్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం, గూగుల్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిత్తల్ లాంటి సంస్థలు వస్తున్నాయి. రైల్వే జోన్ కూడా ఏర్పాటవుతోంది, రోడ్లు, రైల్వే, పోర్టుల ద్వారా పెట్టుబడులు వస్తున్నాయి. అమరావతి ఓ గ్రీన్ ఫీల్డ్, నాలెడ్జి సిటీగా, ప్రపంచానికే క్వాంటం క్యాపిటల్‌గా తయారవుతుంది.రాష్ట్రానికి కేంద్రం అన్నివిధాలుగా సహకారం అందిస్తోంది. ప్రజల అభిమానాన్ని చూరగొన్న వ్యక్తులు చంద్రబాబు, పవన్. జగన్ మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు" అని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తెలిపారు.జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, " రాజధాని విషయంలో మనం మొదటి నుంచి ఇబ్బందులు పడుతున్నాం. చంద్రబాబు, పవన్ నాయకత్వంలో కేంద్ర సహకారంతో ఏపీ అభివృద్ధి జరుగుతోంది. ప్రజాస్వామ్య విలువలు ఏమాత్రం గౌరవించలేని ప్రతిపక్షం ఇక్కడ ఉంది. అమరావతికి ఒప్పుకుని ఆ తర్వాత మాట మార్చిన చరిత్ర గత పాలకులది. చరిత్రలో ఎక్కడా రైతులు ఇంత భారీ స్థాయిలో భూములు ఇచ్చింది లేదు. రైతుల త్యాగాలకు శాసనసభ ధన్యవాదాలు తెలపాల్సి ఉంది" అని వెల్లడించారు.

## టెంట్ వేసుకునైనా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేద్దాం

**మొదటిపేజీ తరువాయి –** ప్రభావితం చేశాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. అనుభవజ్ఞుడైన నేత చేతిలో రాష్ట్రం ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశంతోనే, 2014లో ఎటువంటి షరతులు లేకుండా తాను మద్దతు ఇచ్చానని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు ఒక బలమైన ఆశావాదిలా పనిచేశారని కొనియాడారు.సాధారణంగా భూసేకరణ అంటే ఎన్నో గొడవలు, అడ్డంకులు ఉంటాయని, కానీ అమరావతి కోసం రైతులు ఎటువంటి గొడవలు లేకుండా స్వచ్ఛందంగా భూములివ్వడం ఒక గొప్ప విషయమని పవన్ పేర్కొన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన వారందరికీ న్యాయం చేసేలా అప్పట్లోనే అడుగులు పడ్డాయని ఆయన వివరించారు.2019లో ప్రభుత్వం మారిన తర్వాత అమరావతిపై అభాండాలు వేశారని, రాజధాని మహిళా రైతులను రోడ్లపై దారుణంగా కొట్టారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడూ ఇల్లు వదిలి బయటకు రాని ఆడవాళ్లు సైతం రాజధాని కోసం రోడ్డుపైకి వచ్చి పోరాడాల్సిన దుస్థితి కల్పించారని మండిపడ్డారు. గత పాలనలో చట్టసభల్లో దాడులు జరిగాయని, ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుకే రక్షణ లేని 'యుద్ధ వాతావరణం' ఉండేదని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రాన్ని విభజించినప్పుడు కాంగ్రెస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, దాని వల్లే ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పవన్ విమర్శించారు. "తెలంగాణ, ఆంధ్ర వేర్వేరు అనే భావన మాకు ఎప్పుడూ లేదు.. మా దృష్టిలో తెలుగు నేల ఒక్కటే" అని ఆయన ప్రకటించారు. అమరావతికి కల్పిస్తున్న ఈ చట్టబద్ధత భవిష్యత్తు తరాలకు ఒక భరోసా అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమరావతి చట్టబద్ధతను స్వాగతిస్తూనే ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించిన షర్మిల

**మొదటిపేజీ తరువాయి –** నిధులపై ఆమె ప్రశ్నలు కురిపించారు. "కేవలం గెజిట్ నోటిఫికేషన్‌లో పేరు ఉంటే సరిపోతుందా? రాజధాని నిర్మాణానికి కావాల్సిన లక్ష కోట్ల నిధులు ఎక్కడి నుంచి వస్తాయి?" అని ఆమె నిలదీశారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని షర్మిల స్పష్టం చేశారు. సెక్షన్ 94ప్రకారం కేంద్రం ఎంత ఖర్చయినా భరించాల్సి ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మర్చిపోయిందా..? అని ప్రశ్నించారు. రాజధాని కోసం కేంద్రం ఇస్తున్న అప్పులను 'ముష్టి'గా అభివర్ణించారు. హక్కుగా రావాల్సిన నిధుల కోసం అసెంబ్లీలో ఎందుకు తీర్మానం చేయడం లేదని ఆమె నిలదీశారు.ప్రధాని మోదీ గతంలో అమరావతికి 'చెంబుడు నీళ్లు, తట్టెడు మట్టి' ఇచ్చారు.బీజేపీ ఇస్తున్న అరకొర సాయంతోనే రాజీపడదామా? అని ఆమె ఘాటుగా విమర్శించారు. నిధులు అడగకుండా కేవలం చట్టబద్ధత పేరుతో కాలక్షేపం చేస్తూ రాజధాని నిర్మాణ భారాన్ని ఏపీ ప్రజల నెత్తిపై వేయడం సరైంది కాదని మండిపడ్డారు.ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ భవిష్యత్తులో జగన్ వంటి వారు వచ్చినా రాజధాని మారకుండా ఉండేందుకు ఉపయోగపడవచ్చు కానీ, నిధులు లేకుండా అమరావతి కల సాకారం కాదని షర్మిల స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన తాను సంధిస్తున్న ఈ ప్రశ్నలకు కూటమి ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఇక అమరావతిని అంగుళం కూడా కదిలించలేరు

**మొదటిపేజీ తరువాయి –**

పొట్టి శ్రీరాములు త్యాగంతో ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి అప్పుడే విజయవాడను రాజధాని చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు తెలుగువారిని 'మదరాసీలు' అని పిలిచేవారని, ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని తెలిపారు. పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అందిపుచ్చుకుని తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా రాణించారని, తాను సైబరాబాద్ నిర్మించడం వల్లే నేడు తెలంగాణ ఆదాయంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.

**మూడు రాజధానుల కుట్ర.. జగన్‌పై చంద్రబాబు ఫైర్**

ఎన్నికలకు ముందు అమరావతికి జై కొట్టిన జగన్ మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల నాటకానికి తెరలేపారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 'ఒక్క ఛాన్స్' పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన మొదలుపెట్టారని, అమరావతిని శ్మశానం, ఎడారి, ముంపు ప్రాంతం, వేశ్యల రాజధాని అంటూ దుష్ప్రచారం చేసి ప్రజల్లో విషం నింపారని మండిపడ్డారు. మూడు రాజధానుల బిల్లును శాసన మండలి తిరస్కరించి సెలెక్ట్ కమిటీకి పంపితే, నిబంధనలకు విరుద్ధంగా గవర్నర్‌కు పంపి చట్టం చేయాలని చూశారని, కానీ హైకోర్టు జోక్యంతో రాజధానిని కాపాడుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు.రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని శాంతియుతంగా ప్రభుత్వానికి ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ల్యాండ్ పూలింగ్ జరగలేదని చంద్రబాబు అన్నారు. అలాంటి రైతులపై గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని, అక్రమ కేసులు బనాయించి, మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చి, కాళ్లతో తన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులు 1,631 రోజుల పాటు చారిత్రాత్మక పోరాటం చేశారని, 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' పాదయాత్రతో తమ ఆవేదనను తెలియజేశారని కొనియాడారు. వైసీపీ అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిందని, అందుకే ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.

**2028 నాటికి అమరావతి పూర్తి.. పనుల పునఃప్రారంభం**

ప్రజాతీర్పుతో రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయని చంద్రబాబు అన్నారు. అమరావతి పనులు ఇప్పటికే పునఃప్రారంభమయ్యాయని, దాదాపు రూ.56 వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 2028 నాటికి అమరావతిలో ప్రధాన నిర్మాణాలు పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంక్ రోడ్లు 2027 మే నాటికి, అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్లు 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. శంకుస్థాపన చేసిన నగరంలో పనులు ఆగిపోయి, మళ్లీ పునఃప్రారంభించడం చరిత్రలో అమరావతిలోనే జరిగిందని అన్నారు.

**విధ్వంసకారులకు హెచ్చరిక.. మూడు ప్రాంతాల అభివృద్ధికి హామీ**

అమరావతి పనులు వేగవంతం అవుతున్న తరుణంలో ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేశామని, అమరావతిలో ఎవరైనా విధ్వంసానికి పాల్పడాలని చూస్తే అది వారికి చివరి రోజవుతుందని గట్టిగా హెచ్చరించారు. తమ ప్రభుత్వ విధానం 'ఒకే రాజధాని - అన్ని ప్రాంతాల అభివృద్ధి' అని పునరుద్ఘాటించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లను మెగా నగరాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో డేటా సెంటర్, అనకాపల్లిలో స్టీల్ సిటీ, రామాయపట్నం పోర్టు వంటి ప్రాజెక్టులతో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

## మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ - ఓంకారేశ్వర ఆలయ శంకుస్థాపన

**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు.శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం



కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం.ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు.ఈ ప్రాంతంలో ఇప్పటికే 1400 ఏళ్ల నాటి చాళుక్యుల కాలం నాటి మచిలేశ్వర ఆలయం, 800 ఏళ్ల నాటి కాకతీయుల వీరభద్రస్వామి ఆలయం ఉన్నాయి. చేప ఆకారంలో శివలింగం ఉండటంతో ఈ ఆలయానికి మచిలేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఇప్పుడు నిర్మించబోయే అధునాతన ఓంకారేశ్వర ఆలయంతో ఈ ప్రాంతం ప్రాచీన, ఆధునికతల సంగమంగా మారి 'చిన్న శ్రీశైలం'గా ప్రసిద్ధి చెందుతుందని ప్రభుత్వం, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కవిత పార్టీపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉంటుందని... అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించిందని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణ రాజకీ యాల్లో రాబోయే కొత్త సమీకరణాలకు ఇది సంకేతమని అన్నారు. కొత్త పార్టీ పెట్టాలనే కవిత ఆలోచనను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు.ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఆయన విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి కేసీఆరే ప్రధాన కారణమని బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. "కాళేశ్వరానికి కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపీ పెట్టుకుని మరీ ఆయనే దీనిని డిజైన్ చేశారు" అంటూ ఎద్దేవా చేశారు. ఆయన తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే ప్రాజెక్టు కుంగిపోయిందని, వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని మండిపడ్డారు. ఈ పాపమంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉందని బండి సంజయ్ మండిపడ్డారు. ప్రధాని మోదీపై విమర్శలు చేసే క్రమంలో రేవంత్ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై చర్యలు తీసుకోవడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా



**మొదటిపేజీ తరువాయి –** ఐపీఎల్ సీజన్ ప్రారంభ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు బెట్టింగ్ రాయుళ్లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రికెట్‌ను కేవలం ఆటలాగే ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. బెట్టింగ్‌పై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని, ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.గతంలో వందలాది బెట్టింగ్ యాప్‌లను నిషేధించినప్పటికీ, నిర్వాహకులు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. ముఖ్యంగా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలుగా ఈ దందా కొనసాగుతోందని ఆయన వివరించారు. కేవలం డబ్బు కోసం ఇలాంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆన్‌లైన్‌లోనే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రదేశాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పైనా ప్రత్యేక దృష్టి సారించామని కమిషనర్ పేర్కొన్నారు. బెట్టింగ్ కారణంగా అప్పులపాలై కుటుంబాలు వీధిన పడే పరిస్థితులు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. తమ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే, వెంటనే డయల్ 100కు గానీ, 94906 16555 వాట్సాప్ నంబర్‌కు గానీ సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# జైశెట్టి రమణయ్య మరణం చరిత్రకు తీరని లోటు

## చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ



**గొల్లపల్లి మార్చ్ 28ప్రజా మంటలు (అంకం భూమయ్య )** :చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్వర్గస్తులైన జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ చరిత్రకారులు జైశెట్టి రమణయ్య పార్థివ దేహంకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పోతరవేణి తిరుపతి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్ర పితామహునిగా ప్రసిద్ధిచెందిన జైశెట్టి రమణయ్య మరణం తెలంగాణ చరిత్రకు, ఈ ప్రాంత చరిత్రకారులకు తీరనిలోటు అని అన్నారు.తెలంగాణ చరిత్రకు ఆయన చేసిన సేవలను అమోఘమని, జగిత్యాల పట్టణంలోనే మొదటి ఏం.ఏ పట్టభద్రుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సోషల్ సైన్సెస్ లో మొదటి డాక్టరెట్ పట్టభద్రుడుగా అయన మాకు ఆదర్శనీయులు. వారు రాసిన చాళుక్య- కాకతీయ దేవాలయాల చరిత్ర, దక్షిణ భారత దేవాలయాల చరిత్ర అనే గ్రంధాలు దక్కన్ వాస్తు శిల్పకళా రీతులను తెలుసుకోవడానికి గొప్ప ప్రామాణికం అన్నారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్ర సంస్కృతి గ్రంధం మొత్తం తెలంగాణ జిల్లా చరిత్ర రచనలకే మార్గదర్శనం. జగిత్యాల జిల్లా చరిత్ర సంస్కృతి, తెలంగాణలో ప్రముఖ దేవాలయాలు, కోటలు అనే గ్రంధాలు నేటి చరిత్ర పరిశోధకులకు ఎంతో ఉపయుక్తం అని పేర్కొన్నారు.ఇక అన్నింటి కంటే ముఖ్యంగా ఆయన చరిత్రకారుడిగా నిత్యజీవితంలోని, సమకాలీన సంఘటనలను డైరీ రూపంలో రాయడం చరిత్రలోనే ఒక నూతన ఒరవడి. దాదాపు 58 ఏళ్ళ చరిత్రను డైరీ రూపంలో రాయడం ఆయనకే చెల్లిందన్నారు.రమణయ్య జీవితాంతం చరిత్ర బోధన, పరిశోధన, రచనల పట్ల ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత ఈ ప్రాంత చరిత్రను ఇక్కడి ప్రతి విద్యార్థికి బోధించాలని అందుకై ఇంటర్మీడియట్ స్థాయి నుంచి డిగ్రీ వరకు అన్ని కోర్సుల్లో చరిత్రను తప్పనిసరి సబ్జెక్టు చేయాలని కలలుగన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్, నరేష్, నిర్మల, రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పిజి గ్యాస్ ,పెట్రోలియం, డీజిల్ కొరతలేదు

## అదనపు కలెక్టర్ బిఎస్ లత



**జగిత్యాల మార్చి 28 (ప్రజా మంటలు)** :జిల్లా లో ఎల్పిజి గ్యాస్ మరియు పెట్రోలియం అండ్ డిజిల్ ఉత్పత్తులకు ఎటువంటి కొరత లేదని అదనపు కలెక్టర్ బిఎస్ లతా అన్నారు. సరఫరా వ్యవస్థ సాధారణంగా పనిచేస్తోంది మరియు నిరంతర సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి.జగిత్యాల జిల్లాలో మొత్తం ఎల్పిజి కనెక్షన్లు: 3,44,088గాను రోజు వారి బుకింగ్: 4135 సిలిండర్లు గాను సరిపడా గ్యాస్ డెలివరీ చేయబడుతుంది ఎల్పిజి కొరత గూర్చి ఎలాంటి ఆందోలన చెందవద్దనీ అన్ని గ్యాస్ ఏజెన్సీలు మరియు పెట్రోల్ పంపులలో పెట్రోలియం ఉత్పత్తులు జిల్లా కు సరిపడా ఉన్నాయిసమచారము మరియు సమస్యల విచారణ కోసము, టోల్ ఫ్రీ: 8886808092 వినియోగదారులు తమ బుకింగ్ స్థితిని ఆన్లైన్లో లేదా ఎల్పిజి యాప్ ద్వారా తనిఖీ చేయవచ్చుసోషల్ మీడియాలో వచ్చినటువంటి ఎల్పిజి గ్యాస్ మరియు పెట్రోలియం అండ్ డిజిల్ కొరత వదంతులను నమ్మవద్దని గృహ వినియోగాలకి వాడె (డొమెస్టిక్) సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్న 52 వ్యక్తుల పై 6- ఖ కేసులు నమోదు చేసి అట్టి సిలిండర్లను జప్తుచేయడమైనది.పౌరసరఫరాల శాఖ మరియు పోలీసు శాఖల సమన్వయంతో అక్రమంగా గ్యాస్ వినియోగిస్తున్న వారిని చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అలనే పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, తెలిపినారు.

# మిర్జాపూర్ లో ఘనంగా పెద్దమ్మ తల్లి సింహద్వారా రోహణం

## పొన్నబోయిన శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు హుస్నాబాద్



హుస్నాబాద్, మార్చి 28,(ప్రజా మంటలు) :హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ ల కులదేవత శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ సింహద్వార రోహణం దర్వాజాముహూర్తం (కడపపెట్టుట) ముదిరాజ్ కులస్తులు కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో అందరూ ఇంటింటి నుండి బిందెడు నీళ్లు కొబ్బరికాయలు,కుంకుమ పసుపు,బచ్చాలు చేసుకొని డప్పు చప్పుళ్ళతో అమ్మవారి పూనకాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని సింహద్వారా రోహణం చేయడం జరిగిందని ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు ,ఈ కార్యక్రమంలో రాములు,ఎల్లయ్య,యాదగిరి,సమ్మయ్య,వెంకటయ్య,మొగిలి, మల్లేష్ కృష్ణ,సురేష్,శ్రీను,రాజు, రమేష్,యాదగిరి,నారాయణ,రాకేష్ సర్పంచ్ సంపత్,రమణారెడ్డి,భూక్య తిరుపతి,మొండయ్య,రాంరెడ్డి గ్రామస్తులు కుల సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ బస్సులు ప్రైవేట్ యాజమాన్యానికి అప్ప చెప్పే చర్యలు మానుకోవాలి

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి



**హుస్నాబాద్, మార్చి 28 ,(ప్రజా మంటలు):** ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం పరిధిలోనే నడవాలని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఊరుకునేది లేదని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి అన్నారు హుస్నాబాద్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల విషయంలో కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని కార్మికుల సంక్షేమం కోసం వారి కుటుంబాల కోసం ఆర్టీసీ జేఏసీ అండగా ఉండి పోరాటం చేస్తుందని ఆయన అన్నారు.ఆర్టీసీ యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు కార్మికులకు అనుగుణంగా ఉండాలె తప్ప వ్యతిరేకంగా ఉంటే సహించబోమని ఆయన అన్నారు.కరీంనగర్ టు డిపోలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులను పూర్తిగా యాజమాన్యం ఆధీనంలోనే నడవాలని ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పాలనే అనాలోచిత ధోరణి మానుకోవాలని లేనిచో కరీంనగర్ టు డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులతోఈనెల 30న చేపట్టే భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ కే. కొమురయ్య కన్వీనర్ జే. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# ఎర్రబెల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు మూన్నాళ్ల ముచ్చటేనా

## ఎర్రబెల్లికి హుజురాబాద్ డిపో బస్సు బంద్

## ఇబ్బందులు పడుతున్న ప్రజలు




**భీమదేవరపల్లి మార్చి 28 (ప్రజామంటలు) :**మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి హుజురాబాద్ డిపో నుంచి నడుస్తున్న ఆర్టీసీ బస్సు సేవలు మళ్లీ నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత సర్పంచ్ ఎలక్షన్లకు ముందు రోడ్డు రవాణా శాఖ, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మారుమూల గ్రామాలకు కనెక్టివిటీ ఉంటుందనే ఉద్దేశంతో బస్ సర్వీసులు నడిపారు. గత నాలుగు రోజులుగా బస్సు గ్రామానికి రాకపోవడంతో రవాణా సౌకర్యం లేక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సమ్మక్కసారలమ్మ జాతర సమయంలో కూడా సుమారు 20 రోజుల పాటు బస్సు సేవలు నిలిపివేయడం జరిగింది. హుజురాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్ మీదుగా ఎర్రబెల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో ఎర్రబెల్లి, కేసీ క్యాంప్, ఇప్పల్ నర్సింగాపూర్, కాట్రపల్లి, మాణిక్యపురం, గాంధీనగర్, రత్నగిరి, కొప్పూర్, భీమదేవరపల్లి గ్రామాలకు కనెక్టివిటీ పెరిగి ప్రజలకు ప్రయోజనం కలిగింది. అయితే మళ్లీ బస్సు సేవలు నిలిపివేయడంతో ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. అత్యవసర పనుల కోసం హుజురాబాద్, భీమదేవరపల్లి వెళ్లాల్సిన ప్రజలు అధిక చార్జీలు చెల్లిస్తూ ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే హుజురాబాద్ డిపో అధికారులు స్పందించి ఎర్రబెల్లి బస్సు సేవలను పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సు నిత్యం నడిచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రాములవారి పట్టాభిషేకం



**జగిత్యాల మార్చి 28 (ప్రజా మంటలు)** :జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల సీతారామచంద్రస్వామి ఆలయం (ఎడ్లంగడి) లో శుక్రవారం సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించగా శనివారం పట్టాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు విషెస్ సంఖ్యలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ప్రత్యేక వేదికపై సీతారాముల పరివారం ఉత్సవమూర్తులను ఉంచి పట్టాభిషేకం కొనసాగించారు. ఆలయాన్ని ఈ సందర్భంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సతీమణి రాధిక పాల్గొనగా స్వామి వారి శేష వస్త్రంతో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. కాగా అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో కమిటీ సభ్యులు ,అర్చక బృందం భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరులో ఘనంగా దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు



**భీమదేవరపల్లి మార్చి 28(ప్రజా మంటలు):** భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భారీ ధార్మిక కార్యక్రమాలకు గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు బలిజమేడలమ్మ, గొల్లకేతమ్మ దేవతల విగ్రహాలు, శివలింగం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ రాధాకృష్ణ స్వామి , అభయాంజనేయ స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం మరియు నవగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.ఈ మహోత్సవాలు 2026 మే 1వ తేదీ శుక్రవారం నుండి మే 3వ తేదీ ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా మే 3వ తేదీ ఉదయం 8 గంటల 14 నిమిషాలకు వృషభ లగ్న సుముహూర్తంలో ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడుతుంది.ఈ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేదమూర్తులు, బ్రాహ్మణులు శాస్త్రోక్త విధానంలో నిర్వహించనున్నారు. గ్రామ పెద్దలు మరియు యాదవ కులస్తుల నిర్ణయంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.మహోత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామ పెద్దలు కోరారు.

# బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల మార్చి 28 ( ప్రజా మంటలు)** :రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బోనగిరి రాధా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేసుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతూ ఉండగా, స్థానిక నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి విషయాన్ని తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే బోనగిరి రాధ లివర్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 2 లక్షల రూపాయల ఎల్ ఓ సి ని మంజూరు చేపించి, జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాధా కుటుంబ సభ్యులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ , వెంట మాజీ సర్పంచ్ బోనగిరి నారాయణ నాయకులు ఏలూరి శ్రీనివాస్ బడుగు లక్ష్మీ రాజం తదితరులు ఉన్నారు.

# శ్రీ సత్యసాయి విద్యాజ్యోతి నూతన స్కూల్ ఆరంభం



**జగిత్యాల మార్చి 28 ( ప్రజా మంటలు)** :భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో "శ్రీ సత్యసాయి సేవా సమితి, జగిత్యాల ఆధ్వర్యంలో "జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం" గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో "శ్రీ సత్యసాయి విద్యాజ్యోతి " కార్యక్రమాన్ని నూతనంగా ఆరంభించడం జరిగింది.స్కూలు లో ఉన్నటువంటి 63 మంది విద్యార్థులకు బాలవికాస్ క్లాసులను ఆరంభించడం జరుగుతుంది. మరియు విద్యాజ్యోతి ప్రణాళికలలో ఉన్నటువంటి కార్యక్రమాలన్నిటినీ కూడా అమలుపరచటం జరుగుతుంది. మొదటగా పిల్లలకు మరియు పాఠశాలకు ఉపయోగపడే విధంగా -మినరల్ వాటర్ ప్యూరిఫైయర్ ని బహూకరించడం జరిగింది అలాగే పిల్లలచే "మాతృపూజ" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పిల్లలకు స్టేషనరీ, బుక్స్ అలాగే స్వామివారి ప్రసాదాన్ని అందించడం జరిగింది.సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బట్టు రాజేందర్ మాట్లాడుతూ బాలవికాస్ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తూ, విద్య యొక్క ఆవశ్యకతను తెలిపి, పిల్లలు తల్లిదండ్రులను మరియు పెద్దలను గౌరవించడం గురించి, భారతదేశ భక్తిని ఎలా చాటకోవాలో, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, పండుగల విశిష్టత, మానవతా విలువలు, సత్య దర్మ శాంతి ప్రేమలు ఎలా అనుసరించాలో ఇవన్నీ ఈ యొక్క విద్యజ్యోతి కార్యక్రమం కింద పిల్లలకు నేర్పించడం జరుగుతుందని అన్నారు .పిల్లల యొక్క సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని అలాగే పాఠశాలకు కూడా ఇతోదికంగా కావలిసిన సహకారాన్ని అందిస్తామని తెలియపరచడం జరిగింది.ప్రధానోపాధ్యాయులకు జ్ఞాపికను ఇచ్చి, శాలువాతో సత్కరించడం జరిగింది. పిల్లలందరికీ స్వామివారి ప్రసాదాన్ని పంచి కార్యక్రమాన్ని ముగించటం జరిగింది. కార్యక్రమంలో సత్యసాయి సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, ఎర్ర సత్యయ్య, గూడూరు మురళీధర్ రావు, వంగల లక్ష్మీనారాయణ, బాలవికాస్ గురువులు శ్రీలత, అర్చన, ప్రీతి, రజిత, సుజాత పాల్గొనడం జరిగింది.స్థానిక గ్రామ సర్పంచ్ నోముల రమ్య శేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ బాలు గౌడ్ మరియు మండల విద్యాధికారి(ఎం ఈ ఓ) ఎం.గంగాధర్ , స్కూలు ప్రధానోపాధ్యాయులు గడ్డం మహిపాల్ రెడ్డి , బట్టు శ్రీలత , ఉపాధ్యాయులు, మరియు అశోక్ రావు , గ్రామపెద్దలు, పేరెంట్స్ పాల్గొనడం జరిగింది.

# జగిత్యాలలో హజ్ యాత్రికులకు వాక్సినేషన్ ప్రారంభం

## ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పరిశీలన



**జగిత్యాల మార్చ్ 28 (ప్రజా మంటలు):** జగిత్యాల పట్టణంలోని మాతా శిశు హాస్పిటల్లో హజ్ యాత్రికులకు వాక్సినేషన్ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో జరుగుతున్న సేవలను పరిశీలిస్తూ, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను సమీక్షించారు. ఇటీవల ప్రారంభించిన క్రిటికల్ కేర్ యూనిట్ హాస్పిటల్ను కూడా సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, డా. విజయ్ రెడ్డి, డీఈ ఆనంద్, మౌలానా ఉమర్ అలీ బేగ్ కాజ్మీ, సమీండ్ల శ్రీనివాస్, ఖాజిం అలీ, కౌన్సిలర్ కూతురు రాజేష్, పంబాల రాము, శ్రీనివాస్, రవీందర్, సర్పంచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్యం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తుంది

## జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల మార్చి 28(ప్రజా మంటలు)** :అడ్వాన్సుడ్ టెక్నికల్ సెంటర్ ఏ టి సి కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో విద్యార్థుల నైపుణ్య శిక్షణలో భాగంగా చెక్కపై రూపొందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చిత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి అందజేసిన జగిత్యాల ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వర్ రెడ్డి,సిబ్బంది మౌనిక,తదితరులు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్కు ఎల్లారెడ్డి ,ముప్పాళ్ళ రామచంద్రరావు ,గట్టు సతీష్, సమీండ్ల శ్రీనివాస్, సురేందర్రావు,తిరుమలయ్య,శ్రీనివాస్, మల్లయ్య, కొలగని సత్యం, శరత్ రావు, భూమయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది నియోజకవర్గాల్లో నూతనంగా 35కోట్ల చొప్పున ఐటిఐ లను అప్గ్రేడ్ చేసి 65 ఏటిసి కేంద్రాలను యువతకు స్కిల్ డెవలప్మెంట్ కోసం స్కిల్ కోర్సులను అందించి ఉపాధి అవకాశాలను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు.ఇటీవల జగిత్యాలలో ఏటీసీ కేంద్రాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించడం జరిగింది అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 15 రోజుల కాల వ్యవధితో ఆరు బ్యాచ్ లను సర్టిఫికెట్ కోర్సులు ఏ టి సి అందజేస్తుంది. యువత ఇట్టి అవకాశాలను ఉపయోగించుకోవాలని అన్నారు.విద్యార్థులకు రహదారి ఇబ్బందులు లేకుండా మంత్రి శ్రీధర్ బాబు చొరవతో 70 లక్షలతో సీసీ రోడ్డు సైతం వేయడం జరిగింది అన్నారు.

# ఎమ్మెల్సీ ఎల్ రమణకు ఆలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



**సారంగాపూర్ మార్చి 28 (ప్రజా మంటలు)** :జగిత్యాల జిల్లా ఈనెల 5న సారంగాపూర్ మండలం రేచపెల్లి గ్రామంలో శ్రీ గండి వెంకటేశ్వర స్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ,మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, బైరి మల్లేశం, కౌన్సిలర్ తోట హరీష్,దయ్యాల మల్లారెడ్డి,పులి మల్లేశం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పిహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన

## జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**మేడిపల్లి మార్చి 28 (ప్రజా మంటలు)** :పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా శనివారం మేడిపెల్లి మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూవిద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పరీక్షలు నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఈ పరిశీలనలో డి.ఈ. వో. కె. రాము , కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది

## ఎమ్మెల్సీ ఎల్ రమణ



**జగిత్యాల మార్చి 28 ( ప్రజా మంటలు)** :జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ వారి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ..శాసనసభ,మండలి సమావేశాలల్లో సంక్షేమ ఊసే లేదన్నారు..ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని,బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది.ముఖ్యమంత్రి నిత్యం ఢిల్లీ పర్యటనలకే పరిమితమయ్యాడన్నారు.ప్రజా సమస్యలపై బీఆర్ ఎస్ వివిధ రూపాల్లో పోరాటం కొనసాగిస్తోందని,వైఫల్యాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా కనీస స్పందన లేదన్నారు..ఫీ రీయింబర్స్మెంట్ పై గవర్నర్ ప్రసంగంలో ఊసే లేదని,ఆరు పంటలకు ఇవ్వాల్సిన రైతుబంధు 3 పంటలకే ఇచ్చారని,రైతు వ్యతిరేకిగా కాంగ్రెస్ సర్కారు పని చేస్తోందని,కామారెడ్డి డిక్లరేషన్ ఏదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ 9 ఏండ్లలో 43 వేల కోట్లు అభివృద్ధికి వెచ్చించిందని,ప్రతిహామీ అమలు చేసే వరకు సర్కారును నిలదీస్తామన్నారు.సమయాన్నికి అనుకూలంగా పార్టీలకు అనుగుణంగా ఎక్కడైతే గౌరవం లభిస్తుందో అక్కడ ఉండడం సహజమని కేసీఆర్ 50 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని 25 ఏళ్లు పార్టీ నడిపించిన అనుభవం 10ఏళ్లు పరిపాలన చేసిన అనుభవం ఉందని వారి సలహాలు పాటించుకుంటూ ముందుకు సాగుతామని ఎల్ రమణ స్పష్టం చేశారు. అనుభవం ఉన్నవారు ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడేవారు ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్నవారు పార్టీలోకి వస్తే బిఆర్ఎస్ పార్టీ తప్పకుండా ఆహ్వానిస్తుందని తెలిపారు.ప్రజల కోసం పనిచేస్తున్నప్పుడు పార్టీ అవకాశాలు ఇస్తుందని పార్టీ హై కమాండ్. సుప్రీమ్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు, పట్టణ మరియు మండల అధ్యక్ష కార్యదర్శులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన శిరిడి సాయి నామ సంకీర్తన సప్తాహం




**జగిత్యాల మార్చి 28 ( ప్రజా మంటలు)** :స్థానిక బైపాస్ రోడ్డు, కృష్ణానగర్ లోని, శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న సాయి నామ సప్తాహం, శనివారం 8 వ. రోజు ఘనంగా ముగింపు జరిగింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు పౌరాణిక పండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక మంగళాశాసనతో, ప్రముఖ పౌరాణిక పండితులు సభాపతి తిగుళ్ల విషు శర్మ, కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గుండయ్య శర్మ నీరజ్ శర్మ కార్యక్రమం జరిపారు. ఈ నాటి కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బల్మూరి డాక్టర్ సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, తవుటు రవిచంద్ర , కడలి రామకృష్ణారావు, సిరిపురం రాజలింగం, రాశీ కిషన్ రావు,మారుతీ రావు, కోటగిరి అశోక్, సిరపురపు రాజలింగం, చిలక మారి గంగాధర్, కంచికషన్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, మాత లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేషనల్ లోక్ అదాలత్ లో రైల్వే కేసుల పరిష్కారం



**సికింద్రాబాద్, మార్చి 28 ( ప్రజామంటలు):** సికింద్రాబాద్ రైల్వే కోర్టులో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్లో రైల్వే కోర్టు పరిధిలో న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి 33 క్రిమినల్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు.అలాగే ఆర్పీఎఫ్కు సంబంధించిన 2563 కేసుల్లో సుమారు రూ.4,62,750 జరిమానాలు విధించారు. కార్యక్రమంలో జీఆర్పీ పీపీ సరిత రాణి, ఆర్పీఎఫ్ పీపీ శ్రీనివాస్ రెడ్డి, నానాజీ, న్యాయవాదులు, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# చరిత్ర అంటే గతం కాదు..



భవిష్యత్తుకు మార్గదర్శి అని నిరూపించిన మహనీయుడు జైశెట్టి దేవాలయాల సాక్ష్యంతో తెలంగాణ ఆత్మను ఆవిష్కరించిన పరిశోధక శిఖరం రమణయ్య

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

తెలంగాణ మేధో ప్రపంచంలో ఒక ధ్రువతార, చరిత్ర పరిశోధనా రంగంలో అజరామరమైన ముద్ర వేసిన మహనీయుడు, ఉద్యమ సిద్ధాంత ఆలోచనా పరుడు డాక్టర్ జైశెట్టి రమణయ్య జీవన ప్రస్థానం అసాధారణమైనది. 85 ఏళ్ల పరిపూర్ణ వయస్సులో జగిత్యాలలోని తన స్వగృహంలో ఆయన కన్నుమూయడం కేవలం ఒక వ్యక్తి మరణం కాదు, తెలంగాణ సామాజిక, సాంస్కృతిక చరిత్రలో ఒక మహోజ్వల అధ్యాయం ముగియడం. చరిత్రను కేవలం గతాన్వేషణగా కాకుండా, వర్తమాన చైతన్యానికి, భవిష్యత్ నిర్మాణానికి పునాదిగా భావించిన అరుదైన దార్శనికుడు ఆయన. జగిత్యాల గడ్డపై జన్మించి, ఆ ప్రాంతం నుండి మొట్టమొదటి పీహెచ్‌డీ పట్టా పొందిన పరిశోధకుడిగా రమణయ్య సృష్టించిన చరిత్ర అజరామరం. "సౌత్ ఇండియా టెంపుల్స్" (దక్షిణ భారత దేవాలయాలు) అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా



పత్రం, ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆలయాల శిల్పకళ, శాసనాలు, నిర్మాణ శైలిపై ఆయన చేసిన విశ్లేషణలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. దేవాలయాలను కేవలం మతపరమైన కోణంలో కాకుండా, ఆనాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు ప్రతిబింబాలుగా ఆయన ఆవిష్కరించిన తీరు అద్భుతమైనది.

1971లో సిద్దిపేట జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల్లో చరిత్ర అధ్యాపకుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన రమణయ్య, విద్యార్థుల్లో కేవలం సబ్జెక్టు పట్ల ఆసక్తిని మాత్రమే కాదు, ప్రాంతీయ అస్తిత్వం పట్ల మక్కువను కూడా కలిగించారు. ఆ కాలంలో ఆయన వద్ద విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ఒకరైన తెలంగాణ మలి ఉద్యమ సారథి, తెరాస అధినేత

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పై రమణయ్య ప్రభావం అత్యంత గాఢమైనది. తెలంగాణ భూమి పుత్రుల ఆవేదనను, ఈ ప్రాంతపు గొప్పతనాన్ని, చారిత్రక అన్యాయాలను ఆయన తరగతి గదిలో బోధించిన తీరు కేసీఆర్ వంటి నాయకుడి ఆలోచనా ధోరణిని మలిచింది. అందుకే తెలంగాణ రాజకీయ యవనికపై కేసీఆర్ సాధించిన విజయాల వెనుక రమణయ్య గ మార్గదర్శకత్వం, సిద్ధాంత బలం ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. రాజకీయాధికారం కంటే సామాజిక విముక్తి ముఖ్యం అని నమ్మిన ఆయన, కేసీఆర్‌కు రాజకీయ గురువుగా గుర్తింపు పొందడం తెలంగాణ చరిత్రలో ఒక కీలక ఘట్టం. రమణయ్య పరిశోధనల్లో శాస్త్రీయత, నిబద్ధత ఉట్టి పడతాయి. తెలంగాణ చరిత్రను విస్మరించిన పాలకుల కాలంలో, ఈ గడ్డపై ఉన్న ప్రతి శిలాశాసనాన్ని, ప్రతి ప్రాచీన కట్టడాన్ని ఆయన స్వయంగా సందర్శించి ప్రాణప్రతిష్ఠ చేశారు. నిజాం కాలపు భూస్వామ్య వ్యవస్థలో రైతాంగం అనుభవించిన వెతలు, అణచివేతకు గురైన తెలంగాణ సంస్కృతిని ఆయన తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన అందించిన చారిత్రక సాక్ష్యాలు, గణాంకాలు ఉద్యమకారులకు గొప్ప ఆయుధాలుగా మారాయి. స్వీయ గుర్తింపు లేని జాతి మనుగడ సాగించలేదని నమ్మిన ఆయన, తెలంగాణ భాష, యాస, సంప్రదాయాల పరిరక్షణే పరమావధిగా జీవించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, గ్రామీణ వృద్ధుల నుండి మౌఖిక చరిత్రను సేకరించడం ఆయనకున్న పరిశోధనా తృష్ణకు నిదర్శనం.

ప్రజాస్వామిక విలువల పట్ల గట్టి నమ్మకం ఉన్న రమణయ్య, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా విశ్రమించలేదు. రాష్ట్ర అభివృద్ధిలో సామాజిక న్యాయం, విద్య, సాంస్కృతిక పునరుజ్జీవనం ఎలా ఉండాలో నిరంతరం సూచిస్తూనే వచ్చారు. ఆయన వ్యక్తిత్వంలోని సరళత, నిరాడంబరత అశేష శిష్యకోటికి ఆదర్శం. ఎంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించినా, తన స్వస్థలమైన జగిత్యాల పట్ల, అక్కడి మట్టి పట్ల ఆయనకున్న మమకారం వీడలేదు. ఒక చరిత్రకారుడిగా ఆయన మిగిల్చిన గ్రంథాలు, విశ్లేషణలు రాబోయే పరిశోధకులకు దిక్సూచి వంటివి. చరిత్ర అంటే కేవలం రాజుల కథలు కాదని, అది సామాన్య ప్రజల జీవన చిత్రమని నిరూపించిన డాక్టర్ జైశెట్టి రమణయ్య మరణం తీరని లోటు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, తెలంగాణ అస్తిత్వ పోరాటంలో ఆయన రగిల్చిన జ్ఞానదీపం నిరంతరం వెలుగుతూనే ఉంటుంది. ఆ మహనీయుని స్మృతికి నివాళి అర్పించడం అంటే ఆయన ఆశయాలను, తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు సగర్వంగా అందించడమే.



# చరిత్రలో, చరిత్రతో కలిసి నిలిచిన

## జగిత్యాల మహోన్నత చరిత్రకారుడు, విద్యా శిఖరం

డావ జైశెట్టి రమణయ్యగారి జీవితం విశ్లేషణాత్మక అవలోకనం

సిహెచ్ వి ప్రభాకర్ రావు. సీనియర్ జర్నలిస్ట్

### ప్రారంభ జీవితం మరియు నేపథ్యం



డావ జైశెట్టి రమణయ్యగారు 9 మే 1938న జగిత్యాలలో జన్మించారు. నిండు జీవితం అనుభవించి, 88 ఏళ్ల వయసులో, శ్రీరామనవమి, మార్చ్ 27, 2026 రోజున పరమపదించారు. నడిచే గ్రంథాలయంగా చెప్పుకొనే రమణయ్య గారి మరణం జగిత్యాల విద్యావేత్తలకు, సమాజాసేవకులకు తీరని లోటు. నిజాం పాలనలో పుట్టి, స్వాతంత్ర్యానంతర భారతదేశ మార్పులను అనుభవిస్తూ ఎదిగిన తొలి తరం విద్యావంతుల్లో ప్రముఖులు. సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే కష్టాలను ఎదుర్కొంటూ విద్యను ఆశ్రయించి జీవితాన్ని నిర్మించుకున్నారు.

### విద్య ద్వారా సాధించిన అద్భుత ఎదుగుదల


పదిహేడవ యేట సింగిల్ టీచర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన, ఆర్థిక పరిమితుల మధ్యనే చదువును కొనసాగించారు. పీూ, దీ.జు,, వీూప్రఅశ్రీ,ూప్ర.ఱ. వంటి ఉన్నత విద్యలను సాధించి లెక్చరర్, రీడర్ స్థాయికి ఎదిగారు. ఒకేసారి ఉపాధ్యాయుడిగా, విద్యార్థిగా, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ సాధించిన ఈ ప్రయాణం అసాధారణమైనది.

### చరిత్రకారుడిగా విశిష్ట కృషి

రమణయ్యగారు ఉత్తర తెలంగాణ చరిత్ర పరిశోధనలో విశేష కృషి చేశారు. దేవాలయాలు, శిలాశాసనాలు, పురావస్తు ఆధారాలను సేకరించి చారిత్రక విశేషాలను వెలుగులోకి తీసుకువచ్చారు. "దక్షిణ భారతదేశంలో దేవాలయాలు", "కరీంనగర్ జిల్లా చరిత్ర, సంస్కృతి" వంటి పుస్తకాలు ఆయన పరిశోధనా ప్రతిభకు నిదర్శనం. మొత్తం 20కి పైగా చరిత్ర గ్రంథాలను రచించారు.

### డైరీలు చారిత్రక సంపదగా మారిన జీవితం

అరవై సంవత్సరాల పాటు నిరంతరంగా డైరీలు రాయడం ఆయన ప్రత్యేకత. ఈ డైరీలు వ్యక్తిగత జీవితానికి మాత్రమే కాకుండా సమకాలీన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలను కూడా నమోదు చేశాయి. ఇవే ఆయన "స్వంత ఎదుగుదల" స్వీయ చరిత్రకు పునాది అయ్యాయి. ఎనిమిది దశాబ్దాల జగిత్యాల చరిత్రకు, ఆయన డైరీలు ప్రత్యక్ష సాక్షాలు.





### విజయాలు మరియు పురస్కారాలు

రమణయ్యగారు అనేక గౌరవాలు అందుకున్నారు. 1961లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా రజత పతకం అందుకున్నారు. "వాసవీ నవరత్న", "పౌరరత్న" వంటి బిరుదులు పొందారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ చరిత్రకారుడిగా గుర్తింపు పొందారు. అంతేకాక, తన ఖర్చులతో 500 మందికి పైగా ప్రతిభావంతులను సత్కరించడం ఆయన సేవా మనసును తెలియజేస్తుంది.

### వ్యక్తిత్వం మరియు ప్రభావం

ఆయన గొప్ప వక్త, ఆదర్శ ఉపాధ్యాయుడు. వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. వారిలో కొందరు ఉన్నత పదవులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయకులుగా ఎదిగారు. విద్యార్థులతో సాన్నిహిత్యం, సమాజంపై చైతన్యం కలిగించడం ఆయన ప్రత్యేకత.

### గొప్పతనానికి మూల కారణం

స్వయంకృషి, క్రమశిక్షణ, జ్ఞానాసక్తి, సేవాభావం ఇవే ఆయన గొప్పతనానికి కారణాలు. వ్యక్తిగత విజయాన్ని సమాజాభివృద్ధితో అనుసంధానం చేయడం ఆయన విశిష్ట లక్షణం. భారత ప్రధాని పివి నరసాయిమహారాయాఉ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి లాంటి వారితో పాటు తెలంగాణ ఉద్యమనేత, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు తొ సన్నిహిత సంబందాలు ఉన్న మహనీయుడు. తెలంగాణ చరిత్రను ఎందరో ఉద్యమకారులకు పరిచయం చేసిన మహా మనీషి.

### ఉపాధ్యాయులకు సన్మానాలు:

ఎంతగా ఎదిగినా, తన మూలాలను మారిచిపోకుండా, పదేళ్ళ బాలునితో పాటు, మహా మేధావుల వరకు అనాదరిని సందేఉశతి తో చూసిన గొప్ప వ్యక్తిత్వం ఆయనది. ఉపద్యాయునిగా జీవితం ప్రారంభించిన రమణయ్య, తనకు సమాజమాలో గౌరవం సంపాదించిపెట్టిన వృత్తిపట్ల నిజాయితీగా ఉంటూ, ఆ వృత్తిలో ఉన్న వారిని గౌరవించడానికి కంకనము కట్టుకొన్నారు. తాను అధ్యాపక వృత్తి నుండి విశ్రాంతి పొందినా, నిబద్దతతో దాదాపు రెండు దశాబ్దాలపాటు ప్రతి ఉపాధ్యాయ దినోత్సవం రోజున పదుల సంఖ్యలో ఉపాధ్యాయులను సన్మానించి, ఆదూయపక వృత్తి పట్ల, అధ్యపకులపట్ల తనకున్న గౌరవాన్ని తెలియజేశాడు. డావ జైశెట్టి రమణయ్యగారి జీవితం ఒక సాధారణ వ్యక్తి అసాధారణ శిఖరాలను ఎలా అధిరోహించగలడో చూపించే ప్రేరణాత్మక గాథ. ఆయన రచనలు, సేవలు, విలువలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలిచే అమూల్య సంపద.



# మూడు దశాబ్దాల నిబద్ధతకు ప్రతిఫలం

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా దినేష్ నియామకం

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్



జిల్లా రాజకీయాల్లో మౌనంగా పనిచేసే, కానీ ప్రభావవంతమైన నాయకత్వంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సంగన భట్ల దినేష్ నియామకం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జరగడం ఒక విధంగా ప్రజాసేవకు ఆయన చేసిన దీర్ఘకాల కృషికి లభించిన గౌరవంగా భావించవచ్చు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, క్రమంగా ప్రజా సమస్యలపై పట్టుదలతో ముందుకు సాగుతూ, రాజకీయ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. గ్రామస్థాయి నాయకత్వం నుంచి జిల్లా స్థాయి బాధ్యతల వరకు ఎదిగిన ఆయన ప్రయాణం, నేటి యువ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోంది.ప్రస్తుతం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సంగన భట్ల దినేష్, పార్టీ వ్యవస్థలో క్రమశిక్షణ, నిబద్ధత, సమన్వయం అనే విలువలను ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన నాయకత్వంలో మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు మరింత చురుకుగా సాగాయి. పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రతి కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిలా భావిస్తూ, వారికి ప్రోత్సాహం ఇవ్వడం ఆయన ప్రత్యేక లక్షణం.గతంలో ధర్మపురి ఎంపీటీసీగా పనిచేసిన సమయంలోనే ఆయన ప్రజా సమస్యలపై లోతైన అవగాహనను పెంపొందించు కున్నారు. గ్రామీణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పేదల సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, స్థానిక ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో, వాటి పరిష్కారానికి కృషి చేయడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఎంపీటీసీగా ఉన్నప్పుడే ఆయన ప్రజల మధ్య విశ్వసనీయ నాయకుడిగా ఎదిగారు.దివంగత మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు అనుచరుడిగా సంగన భట్ల దినేష్ రాజకీయంగా మరింత పరిపక్వత సాధించారు. రత్నాకర్ రావు సాన్నిధ్యంలో ఆయన రాజకీయ దిశ, దృక్పథం మరింత బలపడింది. నాయకత్వం అంటే కేవలం అధికారంలో ఉండటం కాదు, ప్రజలకు సేవ చేయడం అనే భావనను ఆయన గురువు ద్వారా నేర్చుకున్నారు. అదే మార్గంలో నడుస్తూ, తన రాజకీయ జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశారు.ధర్మపురి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆయన చూపిన పరిపాలనా నైపుణ్యం ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. దేవస్థాన అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు భక్తుల ప్రశంసలను అందుకున్నాయి. ఆలయ పరిసరాల అభివృద్ధి, సదుపాయాల విస్తరణ, పారదర్శక పరిపాలన వంటి అంశాల్లో ఆయన చేసిన కృషి స్పష్టంగా కనిపించింది. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంలో ఆయన చూపిన కట్టుబాటు, ఆయన పరిపాలనా సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని వీడకుండానే కొనసాగుతున్న ఆయన రాజకీయ ప్రయాణం, నేటి రాజకీయ పరిస్థితుల్లో అరుదైన ఉదాహరణగా చెప్పవచ్చు. అనేక ఒడిదుడుకులు, మార్పులు వచ్చినప్పటికీ పార్టీ పట్ల ఆయన నిబద్ధత ఏమాత్రం తగ్గలేదు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సేవను ప్రాధాన్యంగా తీసుకున్న నాయకుడిగా ఆయన నిలిచారు. ఈ స్థిరత్వమే ఆయనకు పార్టీ నాయకత్వం నుంచి విశ్వాసాన్ని తీసుకువచ్చింది.సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు అత్యంత సన్నిహితులైన దినేష్, ఆయనచొరవతో సంగన భట్ల దినేష్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా నియమించడం, ఆయన సామర్థ్యాన్ని గుర్తించిన నిర్ణయంగా భావించవచ్చు. ఈ బాధ్యత ఆయనకు ఒక సవాలుగా కూడా నిలుస్తోంది. గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులలో చదువుపట్ల ఆసక్తి పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లో జ్ఞాన వనరులను విస్తరించడం వంటి లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత ఇప్పుడు ఆయనపై ఉంది.ప్రస్తుతం సమాజంలో పుస్తక పఠనం తగ్గిపోతున్న నేపథ్యంలో, గ్రంథాలయాల ప్రాముఖ్యతను తిరిగి ప్రజలకు తెలియజేయడం అత్యవసరం. ఈ దిశగా సంగన భట్ల దినేష్ చేపట్టబోయే కార్యక్రమాలు కీలకంగా మారనున్నాయి. డిజిటల్ యుగానికి అనుగుణంగా గ్రంథాలయాలను ఆధునీకరించడం, యువతను ఆకర్షించే విధంగా పుస్తకాల ఎంపిక, పఠన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల్లో ఆయన వినూత్న ఆలోచనలు అమలు చేస్తారని ఆశించవచ్చు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించడం ద్వారా, విద్యా రంగానికి ఆయన అందించే సేవలు మరింత విస్తరించే అవకాశముంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాల కొరతను తీర్చడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ విషయాన్ని గుర్తించి, ప్రతి గ్రామానికి గ్రంథాలయ సౌకర్యాన్ని చేరువ చేయడం ఆయన ముందున్న ప్రధాన లక్ష్యంగా నిలవాలి.సంగన భట్ల దినేష్ వ్యక్తిత్వంలో కనిపించే వినయం, కృషి, ప్రజల పట్ల ప్రేమ, పార్టీ పట్ల నిబద్ధతకలగలిపి ఆయనను ఆదర్శ నేతగా నిలబెట్టాయి. ఆయన రాజకీయ జీవితం కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజా సేవ కోసం సాగుతున్నదనే విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ లక్షణాల వల్లే ఆయనకు జిల్లా స్థాయిలో ఈ కీలక బాధ్యత లభించింది.మొత్తంగా చూస్తే, సంగన భట్ల దినేష్ గారి నియామకం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జరగడం ఒక వ్యక్తిగత విజయమే కాకుండా, ప్రజాసేవకు ఆయన చేసిన నిరంతర కృషికి లభించిన గుర్తింపుగా భావించాలి. భవిష్యత్తులో ఆయన ఈ బాధ్యతను సద్వినియోగం చేసుకుని, జిల్లా విద్యా అభివృద్ధికి, జ్ఞాన విస్తరణకు కీలక పాత్ర పోషిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

# శ్రీవారి భక్తులకు అలర్ట్

## శ్రీవాణి ట్రస్టు టికెట్ల విధానంలో మార్పులు




తిరుమల శ్రీవారి ఆన్ లైన్ కరెంటు బుకింగ్‌లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తొలగించేందుకు టికెట్ల జారీ విధానంలో టీటీడీ కీలక మార్పులు చేసింది. శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్ల జారీ విధానంలో భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇకపై విరాళం, దర్శనం టికెట్లకు వేర్వేరుగా కాకుండా ఒకే లావాదేవీలో డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కొత్త విధానం శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చింది.గతంలో భక్తులు మొదట రూ.10,000 విరాళం చెల్లించి, ఆ తర్వాత రూ.500 దర్శనం టికెట్ బుక్ చేసుకోవాల్సి ఉండేది. ఈ ప్రక్రియలో విరాళం చెల్లింపు విజయవంతమైనా, సాంకేతిక కారణాల వల్ల దర్శనం టికెట్ ఖరారయ్యేలోపే కోటా పూర్తవడంతో చాలామంది ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు టీటీడీ, విరాళం రూ.10,000, టికెట్ ధర రూ.500 కలిపి మొత్తం రూ.10,500 ఒకేసారి చెల్లించేలా మార్పులు చేసింది.ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ కోటా కింద టీటీడీ ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు 800 శ్రీవాణి టికెట్లను విడుదల చేస్తుంది. భక్తులు ఒకే లావాదేవీలో గరిష్టంగా నాలుగు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఈ చెల్లింపుల ప్రక్రియ కోసం యూనియన్ బ్యాంక్‌తో టీటీడీ ఒప్పందం చేసుకుంది. యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా సులభంగా చెల్లింపులు చేయవచ్చు. ఈ ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్‌తో పాటు, మూడు నెలల ముందుగా అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే సౌకర్యం యథావిధిగా కొనసాగుతుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com